కథా నిలయం
3578
230

న్యాయవాది

'అమ్మబాబోయ్....ఎంత పని చేశాను.

నిక్షేపంలాంటి ఉద్యోగానికి రాజీనామా యిచ్చానే.... ఈ ప్రాక్టీసేమిటి.... నేనేమిటి....... నా కెవరు కేసులిస్తారు .... ఊహించుకుంటూ ఆనందరావు. ఆయాసపడుతున్నాడు.

'ఏమిటోయ్ ఆలోచనల్లో వున్నట్లున్నావ్....నిన్నే.... పిలుస్తుంటే వినపట్టంలా....' కొంచెం బలంగానే, ఆనందరావు వీపును చరిచాడు వాసు.

ఉలిక్కిపడి 'ఏమిటా మోటసరసం.... వెన్నంతా నెప్పట్టింది గాదుటోయ్.... మొహం చిట్లించాడు ఆనందరావు, ఎడంచేత్తో వీపును నిమురుకుంటూ.

శారద పకపకా నవ్వింది ప్రక్కనే నిలబడి.

'మనవాడు ఆంజనేయస్వామి అంతవాడు అంటే హనుమంతులవారు తనశక్తిని తాను తెలుసుకునేవాడు కాదుట. యితరులు చెప్పేదాక....' వాసు, మొహం యింత వెడల్పు చేసుకుని దీర్ఘంగా, ఆనందరావు మొహంలోకి చూస్తున్నాడు.

'నీ కసలు మంచి మాటలు రావేంటి...' కసురుకున్నాడు, ఆనందరావు.

'చూడు శారదా, నేనేమన్నానని...అసలు యింతకీ దిగులు పడాలసిన అవసరం యేమిటి.... ప్రాక్టీసుపెట్టి యెన్నాళ్ళయిందని. అయినా, మన వాడు న్యాయవాది వృత్తి చేపట్టినట్టు పదిమందికి తెలియాలిగా మరి.... అదీగాక, అడపా, తడపా, ఒకటీ అరకేసులు తెస్తుంటే, ఛా ఛీ అని విదిలించు కుంటాడా! అసలు యేమిటి యితని మనస్తత్వం నాకర్థం కావటం లేదు ...' నడుం మీద చెయ్యి పెట్టుకుని తల పైకెత్తి, ఆనందరావు మొహంలోకి అదే పనిగా చూస్తూ నిలబడ్డాడు వాసు.

'అద్దెకుంటూ, ఏడాది బట్టీ అద్దె యివ్వకుండా, ఆ యింట్లోనే తిష్ట వేసుకుని కూర్చుని, యజమాని, యిల్లు ఖాళీ చెయ్యమని దావావేస్తే, ఆ కాగితాలు పట్టుకుని, నా దగ్గరకు తీసుకొస్తావా, ఆ కిరాయి వాణ్ణి. వాడి తరపున నేను కోర్టులో వాదించాలా. ఇదేగా నువ్వు తెచ్చిన కేసు...'

'కోర్టునుంచి సమ్మన్స్ వచ్చింతర్వాత కూడా, కేసు లేదంటావేమిటో, యిదెక్కడి కర్మంట! అయ్యో రామచంద్ర! కేసే లేకపోతే ఆ యజమాని, రామబ్రహ్మం మీద దావా యెందుకు వేస్తాడంట. నీకా మాత్రం తెలీకపోతే యెట్లా!....'

'అద్దె యెగ్గొట్టే వాళ్ళనీ, ఇళ్ళు ఖాళీ చెయ్యని వాళ్ళని ప్రోత్సహించమంటావ్! అంతేనా నువ్వనేది ...'

'అసలు నీకు చెప్పలేక నాకు మతి పోతోంది.... నువ్వైనా చెప్పవమ్మా శారదా మీ ఆయనకు....'

శారద కిలకిల నవ్వుతూ లోపలికి వెళ్ళి పోయింది.

'నా అంతరాత్మకు విరుద్ధంగా ప్రవర్తించమంటే మాత్రం నాకు చేత కాదు నువ్వేదయినా చెప్పు .... కష్టాలకు ఓర్చి, తన జీవితమంతా ధారపోసి, డబ్బు ఖర్చుపెట్టి, చదువులు చెప్పించి, యింత పెద్ద వాణ్ణి చేస్తే, వాడు యీ నాడు తండ్రి మీద దావా వేస్తాడా? నేనేమో, ఆ కొడుకు వకాల్తా పుచ్చుకుని, తండ్రికి యెదురుగా కోర్టులో నిలబడాలా? యిదేగా నీసలహా... ఇలాంటి, పనులు చస్తే చేయను...' నిక్కచ్చిగా అనేశాడు ఆనందరావు చాలా ఉద్రేకంగా.

'ఇహ నిన్ను బాగు చేయటం మాచేతకాదు నీ కర్మ నీదే నేను మాత్రం ఏం చెయ్యగలనేంటి!....' నిస్పృహగా కూలబడ్డాడు. వాసు.

ఆనందరావు కాసేపాగి, తమాయించుకుని, మెల్లగా వాసు దగ్గరకు వెళ్ళి 'వాసూ' అంటూ పిలిచాడు. అతను మాట్లాడ లేదు.

'శారదా, వాసుకు నిజంగా నామీద కోపం వచ్చింది. కొంచెం కాఫీ తీసుకురా....'

'నీమీద కాదు నామీద నాకే కోపం వస్తోంది. ఎందుకు ఉద్యోగానికి రాజీనామా చెయ్యమన్నానా! ఎందుకు యీ వృత్తి

లోకి దింపానా అని. చొరవ తెలివి తేటలు వున్నాయి. ఆ ఆఫీసులో ఫైళ్ళ ముందర, యెన్నాళ్ళని కూర్చుంటావ్. ఎడ్వకేట్‌గా, బాగా షైన్ అవుతావని అనుకున్నాను గాని, నువ్విట్లా చేస్తావని, నే కల్లో కూడా అనుకోలా....' వాసు, చాలా సీరియస్‌గా, తన బాధను వెళ్ళ బుచ్చుకుంటున్నాడు.

'కాఫీ తీసుకో.... 'శారద చేతిలో కప్పును, వాసుకు అందించాడు, తాను కూడా మరొకటి తీసుకుంటూ.

'శారద, యిద్దరి మొహాల్లోకి, క్షణ కాలం చూసి, ముక్కు దూలాన్ని, కిందకు పైకి ఊగించి, గిర్రున తిరిగి వెళ్ళి పోయింది.

'ఎవరు మన దగ్గర కొచ్చినా, న్యాయం కోసమే వస్తారు. ఆ న్యాయమే కోర్టులో జరిగేట్టు చూడాలి. అంతే నీ ధర్మం తర్వాత నీయిష్టం..... 'వాసు చప్పున గబగబ వాకిట్లోకి నడిచాడు.

పిలుద్దా మనుకుంటూ కూడా, పిలవలేక పోయాడు. ఆనందరావు, వాసు వైపుకే చూస్తూ ఆలోచనగా నిలబడ్డాడు మనస్సు ఊగిసలాడుతోంది ఆందోళనగా ఉంది. ఆలోచిస్తున్న కొద్దీ, తన భావాలకీ, తనకీ వ్యతిరేకంగా సమాధానాలు వస్తున్నాయి. ఎట్లా నిర్ణయించు కోవాలో అర్థం కావటం లేదు.

పొద్దు వాలింది. వాకిలి గేటు తీసినట్టు చప్పుడయింది. అఫీసు గది కిటికీలోంచి తొంగి చూశాడు. ఎవరో తనింటికే వస్తున్నట్లు గమనించాడు. ఆయన వాలకం చూస్తుంటే, ఆనందరావు లోపల లోపల సంతోష పడుతున్నాడు చూస్తూ, చూస్తుండగానే, ఆయన లోపలికి రానే వచ్చాడు.

'నమస్కారమండి... తమరేనా ఆనందరావు గారు?...'

'మాది రేపల్లె తాలూకా లెండి... మేం నలుగురం అన్న దమ్ములం. పెదపులివర్రు పొలాల సంగతి మీరు యినే వుంటారనుకుంటా.... మా పొలం కాజెయ్యాలని, ఆ పున్నయ్య మా మీద అనవసరంగా దావా యేశాడు. నాయం యెక్కడికి పోతుంది. మేం గెలిచాం.... అయితే ఆడు ఐకోర్టులో అప్పీలు పెట్టాట.... మీబోర్డు చూసి వచ్చా....,వస్తున్న తుమ్మును ఆపుకోవటానికి సతమత మవుతున్నాడు ఆ వచ్చిన ఆసామి

ఆనందరావుకు ముచ్చెమటలు పోస్తున్నాయి. జేబురుమాల్తో మొహాన్ని తుడుచుకుంటూ, రొప్పుతున్నాడు

తలుపు ప్రక్కనే నిలబడి అంతా వింటూవున్న వాసు, కళ్ళు పెద్దవి చేసుకుంటూ 'శారదా రొట్టె విరిగి నేతిలో పడింది' అన్నాడు మెల్లిగా.

శారద, మూతికి చెయ్యి అడ్డం పెట్టుకుని, బలవంతంగా నవ్వాపు తోంది.

ఖంగున తుమ్మి రెండో తుమ్ము కోసం నిరీక్షిస్తున్నట్లు ముక్కుకు ఎడంగా బట్ట అడ్డం పెట్టుకుని, తల పైకీ క్రిందకు ఊగిస్తున్నాడు వచ్చిన పెద్ద మనిషి.

ఈ సస్పెన్సేమిటి మహా ప్రభూ అనుకుంటూ, కళ్ళార్పకుండా, ఆయన వైపే చూస్తూ, ఆయన నోట్లోంచి ఏంమాట వస్తుందో అన్నట్లు, మహ యిరకాటంగా కూర్చున్నాడు ఆనంద రావు.

తుమ్ము ఆగి పోయినట్టుందీ, ముక్కును సాగదీసుకుంటూ,

'ఇంతకీ తమ దగ్గర కొచ్చిందెందుకంటె, మళ్ళీ ఆయాస పడి నరసయ్య చౌదరి గారు పెద వకీలుట, ఆ రెక్కడుంటారో శలవియ్యండి.... నాకా యీ పట్టణం కొత్త....,

'ఆనందరావు తల గిర్రున తిరిగింది. 'శారదా, మంచి నీళ్ళు 'అని బిగ్గరగా అరవబోయి, మళ్ళీ వెనక్కు తగ్గి, 'నాకు తెలీదండీ, అని గట్టిగా నొక్కి మరీ అన్నాడు.

'అయితే!....'

'అయితే లేదు గియితే లేదు' పళ్ళు పట పట మనిపించాడు ఆనందరావు.

'ఈయన మహా కోపిష్టి లాగా వున్నాడే' సణుక్కుంటూ బయటకు నడిచాడు ఆ ఆసామి.

గభాలున శారదా, పెద్ద గ్లాసు నిండా మంచినీళ్ళు తీసుకొచ్చి, మెదలకుండా టేబుల్ మీద పెట్టి కిక్కురు మనకుండా లోపలికి వెళ్ళి పోయింది.

ఆనందరావు, భార్య వైపు కొర కొర చూస్తూ, గ్లాసుడు నీళ్ళు తాగేశాడు.. వాసు, తలవంచు కుని చేతులు రెండూ దగ్గరకు తీసుకుని, చప్పుడు గాకుండా, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ, మెల్లిగా బైటకు జారి పట్టాడు. ఆనందరావు తుమతుమలాడుతూ అట్లాగే కూర్చున్నాడు

రోజు రోజుకు ఆయన మనస్సు గజి బిజయి పోతోంది. ఎంత ప్రయత్నం చేసినా, తన అంతరాత్మకు విరుద్ధంగా యేమి చెయ్యలేక పోతున్నాడు. చెయ్యటానికి యిష్ట పడటం లేదు ఎన్నో అవ

కాశాలు వచ్చినట్లు వస్తున్నాయే గాని, తీరా గట్టిగా పట్టి చూస్తుంటే, ఏ ఒక్కటి నిలవటం లేదు. ఉక్రోషం ఎక్కువయి పోతోంది. తనను ఎగతాళి చేసే వాళ్ళందరికి చక్కటి గుణపాఠం చెప్పి తీరాలి అని ఉద్రేక పడుతుంటాడు. వాసు మాత్రం ఆ పట్టు విడవటం లేదు సమయం దొరికినప్పుడల్లా, నీతి బోధనలతో ముంచెత్తేస్తూ వుంటాడు. ఉచిత సలహాలు యివ్వటం మాత్రం మానలేదు.

ఆనందరావుకు రాత్రిళ్ళు నిద్ర పట్టటం లేదు. పగలేమో చాలా అలసట గానూ, బాధ పడుతున్నట్లుగా కనిపిస్తాడు. మొహమంతా యింత చేసుకుని గంటల కొద్దీ యెవ్వరితో మాట్లాడకండా, ఒంటరిగా, ఆలోచిస్తూ కూర్చుంటాడు.

'అవును వాసు చెప్పింది నిజమే. యీ వృత్తిలో న్యాయం అన్యాయం అని విడివిడిగా చెప్పలేం. అంతా ఒకటి గానే కనిపిస్తుంది. అయినా, యేది న్యాయమో...యేది అన్యాయమో మనకు మాత్రం యేం తెలుస్తుంది కోర్టువారు నిర్ణయించేదే న్యాయం మనదగ్గరకు వచ్చిన పార్టీ కథనమే సత్యం. అలాంటప్పుడు ఎవరొచ్చినా కాదనేది లేదు. మన వృత్తి ధర్మం నెరవేర్చాల్సిందే. మన బాధ్యతల్నుంచి మనం తప్పించు కోకూడదు.... 'తీవ్రంగా' మథన పడుతూ పట్టుదలగా ఓ నిర్ణయానికి వచ్చేస్తున్నాడు ఆనందరావు

అప్పటి న్నుంచి హుషారుగా, ఆనందంగా, ఉల్లాసంగా, హాయిగా, తేలిగ్గా కనిపిస్తున్నాడు ఆయనలో వచ్చిన మార్పు స్పష్టంగా తెలుస్తూనే వున్నది. వాసు యిట్టే గ్రహించేశాడుకూడా.

ఫరవాలేదు యిహ రైలు పట్టాల మీద కొచ్చేసింది అనుకున్నాడు మనస్సులో వాసు.

పగటి వెలుతుర్ని, మెల్లి మెల్లిగా సంధ్య చీకటి, కబళిస్తూ వస్తుంటే, వీధి లైట్లు గప్పున ఒక్కసారి వెలిగినాయి. చీకటంతా మటు మాయమయి పోయింది. ఆనందరావు గతుక్కు మన్నాడు. చప్పున ఉలిక్కిపడి టైము చూసుకున్నాడు. చాలా సేపట్నుంచి కూర్చున్నానే అనుకున్నాడు. బద్ధకంగా కుర్చీలోంచి లేచి, రెండు చేతులూ రెండు వైపులకూ గట్టిగా విదిలించాడు. తొంగిచూస్తూ, భార్యను పిలవబోయి, వీధి తలుపు చప్పుడయినట్లు అలికిడి విని, కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు. ఇద్దరు వ్యక్తులు పూర్తిగా అపరిచిత మైన వ్యక్తులు లోపలికి వస్తున్నారు.

ఇంగ్లీషులో- 'లోపలికి రావచ్చా' అని అందులో ఓ వ్యక్తి, గుమ్మం ముందు నిలబడి అడిగాడు.

ఆ భాషలోనే లోపలికి రండి అని జవాబిచ్చాడు ఆనందరావు.

ఇద్దరూ వచ్చి కూర్చున్నారు.

'మమ్మల్ని శ్రీనివాసరావుగారు పంపించారు. నా పేరు రామనాథం. ఈయన మా స్నేహితుడు వెంకట్రావుగారు, సెక్రెటేరియట్‌లో పనిచేస్తున్నారు. ఇంతకీ నే వచ్చిన పనేమి టంటే. నా భార్యకు డైవోర్స్ యివ్వాలని, నిశ్చయించుకున్నాను. దీనికి మీ సలహా కావాలి. ఎంత త్వరగా యిప్పిస్తే అంత మీకు కృతజ్ఞతగా వుంటానని, నేను హంబుల్‌గా రిక్వెస్ట్ చేస్తున్నాను. ఫీజు విషయం, మీతో శ్రీనివాస రావుగారు మాట్లాడతానన్నారు....' గుక్క తిప్పుకోకండా చెప్పేశాడు రామనాథం.

ఆనందరావు ఓ క్షణం తటపటాయించి, 'సరే' అన్నట్టు తలవూపి వివరాలు చెప్పండి. అసలు ఏ కారణంమీద మీరు డైవర్స్ అడుగుతున్నారు. సీరియస్‌గా, ఆయన వంక చూస్తూ, 'రైటింగ్ పాడ్'ను ముందర పెట్టుకుని, గబగబ పెన్ కేప్ తీసేశాడు.

'ఏమిటి నా నోటితోనే చెప్పాలా' కస్సుమన్నాడు రామనాథం.

ఆనందరావు కూడ ఆ క్షణంలో ఉగ్రుడయిపోయాడు. మళ్ళీ కోపాన్ని యిట్టే అణచుకొని, 'హిందూ మారేజ్ ఏక్ట్. పదమూడవ సెక్షన్ ప్రకారం, ఎనిమిది సందర్భాలలో మగవాడయితే డైవోర్సు అడగవచ్చు అందులో మొదటిది, భార్య శీలం సరిగ్గా లేకపోతే, మతం మార్చుకుంటే, పిచ్చిదయితే....' గబగబ చెప్పుకుపోతున్న ఆనందరావు చప్పున ఆగిపోయాడు. రామనాథం, హఠాత్తుగా, ఆపండి నాకు పిచ్చెక్కేటట్టుంది, అనేటప్పటికి.

'మీరన్నారే మొదటిది అదే అచ్చంగా అదే. అంతకంటే నే చెప్పేది లేదు, మీరడగాల్సిందీ లేదు. నా వివరాలు తీసుకోండి. ఏం పిటిషన్ తయారుచేస్తారో యేమో, అది మీరు చూసుకోండి మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వచ్చేసి, ఆ కాగితం మీద సంతకం పెట్టేసి, మీ ఫీజు యిచ్చుకుంటాను...' అమాంతం లేచి నిలబడ్డాడు రామనాథం.

'కూచోండి. గట్టిగా గదమాయించాడు, ఆనందరావు. రామనాథం బిత్తరు చూపులు చూస్తూ, చప్పున కూర్చున్నాడు.

'మీరనుకున్నంత సులభంగా జరిగే పని కాదు. నాక్కావలసిన వివరాలు మీరు చెప్పకండా, అట్టా మీరు పారిపోతుంటే, నేను

పిటీషన్ తయారు చెయ్యటం ఎట్లా ? ఆమెగారి శీలాన్ని శంకించ టానికి తగిన ఆధారాలేమన్నా వున్నాయా ? ఎప్పటినుంచీ, ఆమె ఆ ప్రవర్తనకు అలవాటు పడింది. ఇప్పుడు కూడా అది కొన సాగిస్తోందా....'

రామనాధం కొయ్యబారిపోయాడు. అట్లాగే ఆనందరావు మొహంలోకి చూస్తూ కూర్చున్నాడు. ఇంతలోకి వెంకట్రావు అందుకుని, 'మీరు వేసే ప్రశ్నలు, లా ప్రకారం సరియైనవి కావచ్చేమో గాని, మా రామనాధం మాత్రం, వాటికి సమాధానాలు చెప్పలేడు. ఇంకా మీరు యే ఒక్క ప్రశ్నవేసినా భరించలేడు. దయచేసి, 'లా'లో ఏ ప్రకారమయితే విడాకులకు వీలుంటుందో అవన్ని రాసేసి, తయారుగా వుంచండి. మాకు యీ మాత్రం సహాయం చేసిపెట్టండి' ప్రాధేయపడ్డట్టుగా అన్నాడు.

ఆనందరావుకు ఎటూ తోచలేదు. క్షణంసేపు ఆలోచించి, సరే 'మీరు యెల్లుండి సాయంత్రం యిదే టైముకు రండి' అన్నాడు ముక్తసరిగా.

రామనాధం చెయ్యి పట్టుకుని, వెంకట్రావు, మెల్లి మెల్లిగా అడుగులు వేసుకుంటూ బైటకు నడిచాడు.

ఆనందరావు, నుదురు మీద చెయ్యి పెట్టుకుని, తీవ్రంగా మధన పడుతున్నాడు. చివాలున కుర్చీలోంచి లేస్తాడు, మళ్ళీ చప్పున వచ్చేసి కూర్చుంటాడు కళ్ళు గట్టిగా మూసుకుని, పళ్ళు బిగించి చాలా ఆరాటపడుతున్నాడు. క్షణంలో కళ్ళు గభాలున తెరుచుకుని, తానేదో నిర్ణయానికి వచ్చినట్లు సంతృప్తి పడు తున్నాడు. కాని బైటకు మాత్రం, తాను పడుతున్న ఆందోళన, ఎవ్వరికీ తెలిసేటట్లుగా ప్రవర్తించటం లేదు.

అనుకున్న ప్రకారం, రామనాధం వచ్చినప్పుడు, 'పూర్తి బాధ్యతంతా నా మీద పెట్టారు, అందుకని యింకొంచెం టైము కావాలి' అని పంపించేశాడు, ఆనందరావు.

ఓ కంట కనిపెడుతున్న వాసుకు యిదంతా అగమ్య గోచరంగా వుంది. చప్పన పిటీషన్ తయారుచేసి, ఫీజు తీసుకుని, అతన్ని పంపించేసెయ్యక యెందుకు యిట్లా తిప్పిస్తాడు అని, చిరాకు పడుతున్నాడు. అయితే, తాను యీ కేసులో జోక్యం చేసుకోవటం యిష్టంలేక మెదలకుండా ఊరుకుంటున్నాడు దానికి కారణం కూడా ఒకటి లేకపోలేదు. అసలు నిజానికి - రామనాధాన్ని, ఆనందరావు దగ్గరకు పంపించింది, వాసే. తీరా, తాను పంపించానని తెలుస్తే, ఏ విధంగా పరిణమిస్తుందోనని, శ్రీనివాసరావు పంపించినట్లు చెప్పించాడు. రామనాధానికి మతిపోయి, యిక డైవోర్స్ తప్పదని ఖాయం చేసుకున్న సమయంలో ఆంతరంగికుడయిన ఓ లాయర్ని 'సెలెక్ట్' చేసుకోవాలనుకున్న సందర్భంలో, వాసు తారసిల్లాడు. అతనికి ఆంతరంగికుడు ఆనందరావు కంటె యింకెవరున్నారు కనక ! ఆ కేసు కాస్తా యిట్లా వచ్చేసింది. అందుకనే వాసుకు క్షణక్షణం ఆదుర్దాగానే వుంది, రోజులు గడుస్తున్న కొద్దీ, వాసుకు చాలా భయంగానూ, గాభరాగానూ వుంది. ఓ మూల రామనాధం సూటిపోటీ మాటలతో సతమతమవుతున్నాడు. ఇటేమో తీరా ఆనంధరావు, చివ్వరికి యేం చేస్తాడో అని గజగజలాడి పోతున్నాడు.

ఈసారి రామనాధం, ఒంటరిగా వచ్చాడు అయితే అంత దూకుడుగా మాత్రం రాలేదు చాలా తగ్గి మాట్లాడుతున్నాడు. ఆనందరావు, అతనితో చాలా సేపు మాట్లాడాడు. చాలా నెమ్మదిగా

మాట్లాడటం చేత, తలుపు చాటున నిలబడినా కూడా, వాసుకు ఆ సంభాషణ యేమీ అంతుపట్టలేదు.

మర్నాడు వస్తూ వస్తూనే, వాసు అమాంతం, ఆనందరావు మీద విరుచుకుపడ్డాడు.

'నువ్వింతపని చేస్తావని నే కల్లో కూడా ఊహించలేక పోయాను. రామనాధం భార్య తరపు ప్లీడరుతో నీకేమిటి సంబంధం. అయనతో నువ్వు గంటల తరబడి మాట్లాడటం, చూస్తుంటే, నువ్వు బాగా దిగజారిపోయావని, మనిద్దరికీ తెలిసిన వాళ్ళే నాతో వచ్చి చెప్పారు. ఇంకా వాళ్ళేవేవో చెప్పారనుకో, వాటిని నేను నమ్మలేదు....

'ఏం చెప్పారేమిటి !....'

'వినాలని వుందా, నువ్వు అవతల పార్టీ దగ్గర డబ్బు తీసుకుని, రామనాధానికి అన్యాయం చేస్తున్నావని కూడా అన్నారు.... తెలిసిందా!...

'మన మంతా దొరకని దొరలం!....పెద్ద పెట్టున నవ్వాడు ఆనందరావు.

'అయ్యో అయ్యో! ఏమిటా మాటలు. అయితే వాళ్ళన్నది, నేను విన్నది, నిజమే నన్నమాట....!

'ఒక్కటి మాత్రంగుర్తుంచుకో!నేను రామనాధానికి మాత్రం చస్తే అన్యాయం చెయ్యను. నన్ను ఎవరేమన్నా, నాకేం ఫరవా లేదు. నేను నమ్మక ద్రోహిని మాత్రం కాను, కాజాలను....' చాలా సీరియస్‌గా, వాసుమోహంలోకి చూస్తూ అన్నాడు.

వాసు, శారద దగ్గరకు వెళ్ళి మొరపెట్టు కున్నాడు. 'నన్ను తలెత్తుకోకుండా చేసేస్తున్నాడు, ఇంతయిదిగా మారిపోతాడని అనుకోలేదు. రామనాథం నన్ను ఒకమాట అని ఒక మాట అనకండా వుండటం లేదు, ఆయన కేమి సమాధానం చెప్పాలో అర్థం కావటం లేదు. చివ్వరికి యేంచేస్తాడో యేమో అని భయంగా వుంది. తీరాయీ కేసు నేనే పంపించి నట్టు తెలుస్తే, యింకే విధంగా మారుతుందో అనే అనుమానంతో మెదలకండా వూరుకుంటున్నాను. నాకేం తోచటం లేదు...అంటూ వాసు ఏవేమిటో చెప్పుకుంటూ పోతున్నాడు.

ఒక్కక్షణం, నిలబడ్డట్టే నిలబడి, అప్పుడే శారద, లోపలికి వెళ్ళి పోయింది. వాసు తలెత్తి చూసేటప్పటికి, ఆమెలేదు. గతుక్కుమని, అటూ ఇటూ బిత్తరు చూపులు చూస్తూ. గబగబా ఆనందరావు గదిలోకి వచ్చాడు.

అప్పుడే రామనాథం, ఘర్షణగా మాట్లాడి, చరచరా బైటకు వెళ్ళిపోతున్నాడు. వాసుకు కాళ్ళూ, చేతులు ఆడలేదు. ముందుకు ఒక అడుగు వేసి కూడా మళ్ళీ చప్పున ఆగిపోయాడు

'చూడు ఆనందరావు! నేనేమేమో అంటున్నానని అనుకోవద్దు. నామీద దయ తలిచి, యీకేసులో మాత్రం నువ్వు అవతల పార్టీతో....'నీళ్లు నములుతున్నాడు. వాసు.

'ఏమిటి ఈకేసు స్పెషాల్టీ!...'

'అబ్బే అదేంలేదు'....'ఎట్లాగా చెప్పటం' అని తనలో తాను ఉక్కిరి బిక్కిరయి పోతున్నాడు.

'ఈ ప్రొఫెషన్‌లో దిగింతర్వాత అన్ని రకాల పనులు చెయ్యాలిసి వస్తుంది. వచ్చిన అవకాశాన్ని జార విడుచుకోవటంలో

మన గొప్పతనం యేమిటి? మనకు కావాలంటే మాత్రం యిలాంటి అవకాశం ఎప్పుడూ వస్తుందంటావా...

'ఎలాంటి అవకాశం'...బిగ్గరగా అరిచాడు వాసు.

'ఏమిటట్లా ఉద్రేక పడ్డావ్.... ఎట్లా వుంది నీవంట్లో.... శారదా...' అంటూ వాసు చెయ్యి పట్టుకొని, వీపు మీద మెల్లిగా చరుస్తున్నాడు.

'నాకేం లేదు.... నాకు బాగానే వుంది...... ఏం లేదు శారదా... ఊరికే పిలిచాను. నీపని చూసుకో...' వాసు, ఉద్వేగాన్ని అణుచుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు

మర్నాడుకూడా వాసు, ఆనందరావు యింట్లోనే వుండిపోయాడు. బైటకు వెళ్ళాలంటే బెరుకుగా వుంది.

తలవంపులుగా వుంది. రామనాథం ఏమంటాడో అని జంకు. ఇంకా ఆనందరావును గురించి, ఎలాంటి మాట వినాలిసి వస్తుందో అనిబెదురు, అంతకంటె కూడా తనను ఎవరేమంటారో అనే భయం కూడా లేకపోలేదు.

గడియారం సాయంత్రం ఆరుగంటలు ఖంగు ఖంగున కొడుతున్న సమయంలో ఆనందరావు వీధిగేటు తెరుచుకుని, చెంగు చెంగునలోపలికివచ్చేశాడు, సంతోషంగా, వాసు ఆనందరావు వైపే తలత్రిప్పుతూ, ఒదిగి ఒదిగి, గది తలుపుచాటున నక్కివున్నాడు. ఇంత ఆనందానికి, యేమిటా కారణం అని వూహించుకుంటూ.

'శారదా....గుడ్‌న్యూస్....రామనాథం భార్య చెడ్డదేమీ కాదు ....గిట్టని వాళ్లు వాళ్ళిద్దర్నీ విడదియ్యాలని చేసిన ప్రయత్నం....

ఓపికపట్టి, నిజాన్ని బైటకుతీశాను. అదొక పెద్దకథ, సావకాశంగా చెప్తాను... ఇప్పుడిద్దరూ కలిసిపోయారు... డైవోర్స్ పిటిషన్ క్లోజ్.... రామనాధానికి ఎంత సంతోషంగా వుందో చెప్పటానికి వీల్లేదు... ఆ నూతన దంపతుల్ని మనింటికి భోజనానికి పిల్చాను ....ఏమిటి అట్లా చూస్తున్నావ్.... నీ కేమీ అర్థం కాలేదా.... మూగ దానిలాగ అట్టావుండి పోయావేంటి, మాట పలుకు లేకుండా.... నిన్నే... శారదా....'

'అయితే ఈ కేసు కూడా పోయిందన్న మాట.... కళ్లు నలుపుతూ గద్గదంగా అన్నది శారద.

—